క్లుప్తంగా

మంత్రి 'పొన్నం'కు ఆహ్వానం



ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఆలయ ప్రతినిధి

వర్గల్(గజ్వేల్): వర్గల్ క్షేత్రంలో దేవి శరన్నవరాత్రోత్సవాలకు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆహ్వానిస్తూ మంగళవారం ఆలయ కమిటీ ప్రతినిధులు ఆహ్వానపత్రిక అందజేశారు. ఆయన నివాసంలో మంత్రిని కలిశామని, ఉత్సవాలకు హాజరవుతానని చెప్పినట్టు వారు తెలిపారు.

సమ్మె నోటీసు అందజేత



నోటీసును అందజేస్తున్న ఆశా వర్కర్లు

కోహెడ(హుస్నాబాద్): ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యురాలు నిమ్రా తరుణంకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సంర్భంగా సంఘం మండల అధ్యక్షురాలు రజిత మాట్లాడుతూ ఆశా వర్కర్లు శ్రమ దోపిడీకి గురవుతున్నారన్నారు. ప్రభుత్వం నియమిత వేతనం కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాజమణి, అశ్విని, సుజాత, మమత, విజయ, సునీత, అంజలి, శైలజ, అనిత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



విద్యార్థులతో ఉపాధ్యాయులు

ములుగు(గజ్వేల్): మండలంలోని ఆర్అండ్ఆర్ కాలనీ తున్కిబొల్లారం ఉన్నత పాఠశాలలో విద్యార్థులు మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవం, బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులుగా తోటి వారికి పాఠాలు బోధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థినులు బతుకమ్మ ఆటపాటలతో ఆడి సందడి చేశారు. హెచ్ఎం కవితాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన



అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్ర ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల్లో ప్రతిభ చూపిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి జస్వంత్‌ను మంగళవారం ఉపాధ్యాయులు అభినందించారు. హెచ్ఎం విజయ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రీమియర్ లీగ్ అండర్ -14 విభాగంలో ఓవరాల్ ఛాంపియన్‌గా తమ విద్యార్థి నిలవడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్‌లో భారత క్రికెట్ జట్టులో ఆడాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు గీతాదేవి, తిరుపతిరెడ్డి, వెంకటరమణ, రవీందర్ రెడ్డి, శ్రీనివాస్, శ్రీదేవి, దుర్గయ్య, రాజ్‌కుమార్, రాజమోహన్ గౌడ్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

యువజనోత్సవాల్లో విజేతలు వీరే...

సిద్దిపేటజోన్: యువజనోత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో విజేతలను న్యాయనిర్ణేత చంటి ఎంపిక చేశారు. గ్రూపు ఫోక్ డ్యాన్స్‌లో సిద్దిపేట ఏన్సాన్‌పల్లి గురుకుల విద్యార్థులు మొదటి స్థానంలోను, రాఘవపూర్ కస్తూర్బా పాఠశాల విద్యార్థులు రెండో స్థానంలోను నిలిచారు. సోలో ఫోక్ డ్యాన్స్ విభాగంలో మొదటి స్థానంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు, రెండో స్థానంలో సంధ్య, స్రవంతి బహుమతులు అందుకున్నారు. అదేవిధంగా ఫోక్ వ్యక్తిగత విభాగంలో శివ మొదటి స్థానం, శ్రీకాంత్ రెండో స్థానంలో నిలిచారు. స్టోరీ రైటింగ్‌లో రాము మొదటి స్థానంలోను, అశోక్ రెండో స్థానంలో నిలవగా కవిత్వంలో మొదటి స్థానంలో సాగర్, రెండో స్థానంలో విశ్వతేజ నిలిచినట్టు సంబంధించిన శాఖ మేనేజర్ వెంకటేశ్వర్ గౌడ్ తెలిపారు.



హుస్నాబాద్: కేరళ హైస్కూల్‌లో బతుకమ్మలను పేర్చుతున్న విద్యార్థినులు



చిన్నకోదూరు(సిద్దిపేట): కమ్మర్లపల్లిలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు

తీరొక్క పూలతో బతుకమ్మలు

పాఠశాలల్లో ముందస్తు సంబరాలు ● ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

అన్ని మండలాల ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల్లోను ముందస్తు బతుకమ్మ సంబురాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో సందడి చేశారు. బంతి, చామంతి, తంగేడు, గునుగు, గులాబి పుష్పాలతో బతుకమ్మలను పేర్చుకొని ఉత్సాహంగా బతుకమ్మలు, కోలాటాలు ఆడారు. ఉపాధ్యాయులు బతుకమ్మ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. అనంతరం బతుకమ్మలను చెరువుల్లో నిమజ్జనం చేశారు.



కోహెడ(హుస్నాబాద్): మహిళల బతుకమ్మ



మిరుదొడ్డి(దుబ్బాక): చెప్యాలలో..



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): క్రాంతి స్కూల్లో..



బతుకమ్మ సంబరాల్లో మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల, రోజాశర్మ తదితరులు



గజ్వేల్‌రూరల్: సింగాటంలో..



డ్రీమ్ బిగ్ ఆదర్శ విద్యానికేతన్‌లో..



దుబ్బాకటౌన్: దుబ్బాకలో..

గురుకులం మైదానంలో 'క్రీడా ప్రాంగణం'



క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన బోర్డు

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని 17 పంచాయతీలలో గ్రామీణ క్రీడాకారుల కోసం ప్రాంగణాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ప్రభుత్వ స్థలాలను రెవెన్యూ అధికారులు గుర్తించి పంచాయతీలకు అప్పగించారు. అయితే ఆయా గ్రామాల్లో బోర్డులను ఏర్పాటుచేసి సర్పంచ్‌లు చేతులు దులుపుకున్నారు. అయితే సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలోని క్రీడా మైదానంలోనే జిల్లెలగడ్డ పంచాయతీ అధికారులు బోర్డు ఏర్పాటుచేశారు. గురుకులంలోకి గ్రామానికి చెందిన క్రీడాకారులను ఎవరినీ అనుమతించరు. క్రీడా ప్రాంగణాన్ని బిల్లుల కోసం గురుకులంలో ఏర్పాటు చేయడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి యువతకు అనువైన చోట క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలో అనుమతులు లేకుండా నడుస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకల పర్వతాలు ఎంఈఓ ఆర్.కిష్టయ్యను కోరారు. ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయనను మంగళవారం మార్యద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఆయన వెంట నాయకులు చంద్రం, రాజబాబు ఉన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

కురుమ, ధార్మిక సంఘాల డిమాండ్

కొమురవెల్లి(సిద్దిపేట)/చేర్యాల(సిద్దిపేట): బాలికపై అత్యాచారనికి పాల్పడిన యువకుడిని కఠినంగా శిక్షించాలని రాష్ట్ర కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొరికే నరసింహ, బీజేపీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, ధార్మిక పరిషత్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, సినీనటి కరాటే కల్యాణి డిమాండ్ చేశారు. మండలంలో అత్యాచారానికి గురైన బాలిక కుటుంబాన్ని మంగళవారం వారు వేర్వేరుగా పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిందితుడిని ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారణ జరిపి కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. గ్రామంలో మూడో రోజు పోలీసుల పికెటింగ్ కొనసాగింది. కార్యక్రమంలో కురుమ సంఘం, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. బాలికపై అత్యాచారం చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని కురుమ యువ చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు నరసింహ డిమాండ్ చేశారు. స్థానిక గాంధీ సెంటర్ వద్ద రాస్తారోకో చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బీరయ్య, మల్లేశం, పార్వతి, సత్యనారాయణ, శంకర్, రాజ్‌కుమార్, నానిబాబు, అశోక్, మల్లేశం, రాజు, యాదగిరి, కమలాకర్, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.



కొమురవెల్లి(సిద్దిపేట): మాట్లాడుతున్న కరాటే కల్యాణి

రక్షణ కోసమే కమ్యూనిటీ 'కాంటాక్ట్'

ఏసీపీ మధు

సిద్దిపేటరూరల్: ప్రజల రక్షణే తమ లక్ష్యమని ఏసీపీ మధు అన్నారు. రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పుల్లూరులో ఆయన ఆధ్వర్యంలో మంగళవారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ప్రోగ్రామ్ ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. గ్రామాలలో కొత్త వ్యక్తుల సంచారం, నేరస్తులు షెల్టర్ తీసుకుంటున్నారా అనేది తెలుస్తుందని చెప్పారు. గంజాయి, డ్రగ్స్, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్డెన్ సెర్చ్‌లో భాగంగా పత్రాలులేని 50బైక్‌లను సీజ్‌చేసి, బెల్ట్ షాపుల్లో రూ.13వేల విలువైన మద్యాన్ని, గుట్కాల పేకెట్‌లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. కార్యక్రమంలో రూరల్ సీఐ శ్రీను, టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్, దుబ్బాక సీఐ శ్రీనివాస్, త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ విద్యాసాగర్, ఎస్ఐ అపూర్వ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



లిక్కర్, వాహనాలతో పోలీసులు

దాతల సహకారం అవసరం

కొండపాక(గజ్వేల్)/దౌల్తాబాద్(దుబ్బాక): ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతల సహకారం అవసరమని కుకునూరుపల్లి, కొండపాక మండలాల విద్యాధికారులు బచ్చలి సత్తయ్య, శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కుకునూరుపల్లి మండలంలోని మంగోల్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మాజీ సర్పంచ్ పుల్లోజు కిరణ్‌కుమార్‌చారి సహకారంతో 100 మంది విద్యార్థులకు మంగళవారం క్రీడా దుస్తులను అందజేశారు. హైస్కూల్‌కు మాజీ ఎస్ఎంసీ చైర్మన్ మల్లం ఐలయ్య కంప్యూటర్‌తో పాటు క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు ఆటలపై ఆసక్తి కలిగేలా ఉపాధ్యాయులు చొరవచూపాలన్నారు.

ఇసుక లారీ పట్టివేత

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గాగిళ్లాపూర్ శివారులోని మెయతుమ్మెద వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఓ లారీని సోమవారం రాత్రి టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారని ఎస్ఐ కృష్ణారెడ్డి మంగళవారం తెలిపారు. దర్యాప్తుచేసి ఇసుకను తరలించిన చిన్నకోదూర్ మండలంలోని కిష్టాపూర్‌కు చెందిన భాస్కర్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

డీఎస్సీ ర్యాంకర్‌కు సన్మానం

బెజ్జంకి(సిద్దిపేట): డీఎస్సీ ఫలితాల్లో ప్రతిభ కనబరిచి జిల్లాలో రెండో ర్యాంక్ సాధించిన కల్లెపల్లికి చెందిన పరశురాములను కొండిన్య యువజన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కండిన్య యూత్ సభ్యులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

చేర్యాల(సిద్దిపేట): పట్టణ పరిధిలోని నాలుగో వార్డు శ్రీనగర్ కాలనీలో రూ.5లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ స్వరూపరాణి, వైస్ చైర్మన్ రాజీవ్‌రెడ్డితో కలిసి మంగళవారం ప్రారంభించారు. కౌన్సిలర్లు చంటి, సతీశ్, నరేందర్, నాయకులు నాగేశ్వర్‌రావు, భాగయ్య, తిరుపతిరెడ్డి, కాలనీ వాసులు బాబు, రాజు తదితరులు పాల్గొన్నారు.

దుకాణంలో చోరీ

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఉన్న విఘ్నేశ్వర నావల్టీస్ దుకాణంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. స్థానిక ఎస్ఐ నీరేశ్ మాట్లాడుతూ రాత్రి దుకాణం మూసి వెళ్లిన తార్వాత గుర్తుతెలియని వ్యక్తులు లోనికి చొరబడి రూ.62వేల నగదు ఎత్తుకెళ్లారన్నారు. బాధితుడు విజమ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

శాస్త్రవేత్త రామిరెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): రైతులు పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు పొందాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త డాక్టర్ రామిరెడ్డి సూచించారు. మండల పరిధిలోని తీగుల్ రైతువేదికలో యాసంగి వేరుశనగ సాగులో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. జిల్లా వ్యవసాయాధికారి రాధికతో కలిసి మాట్లాడుతూ పంటల సాగులో రైతులు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. అనంతరం గ్రామంలో వరి పొలాలను పరిశీలించి సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వసంతరావు, ఏఈఓలు శరణ్య, సమత, భానుప్రకాశ్, ఖలీల్, కృష్ణమూర్తి, కిరణ్, రైతులు పాల్గొన్నారు.



వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలు మానుకోండి

మాజీ ఎమ్మెల్యే హన్మంతరావు

గజ్వేల్‌రూరల్/కొమురవెల్లి(సిద్దిపేట): బీఆర్ఎస్ నాయకులు ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలను మానుకొని.. సలహాలు, సూచనలు ఉంటే సీఎం రేవంత్‌రెడ్డికి తెలియజేయాలని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సూచించారు. ఆర్అండ్ఆర్ కాలనీలో డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డితో కలిసి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా మల్లన్నసాగర్ ముంపు బాధితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా కొల్గూరులో పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేటీఆర్, హరీశ్‌రావు మల్లన్నసాగర్ ముంపు బాధితులను పట్టించుకోలేదన్నారు. శ్రీనివాస్‌రెడ్డి, హరికృష్ణ, ఎలక్షన్‌రెడ్డి, భూంరెడ్డి, గాడిపల్లి భాస్కర్, నరేందర్‌రెడ్డి, సర్దార్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు. కేటీఆర్, హరీశ్‌రావు అండదండలతోనే మంత్రి సురేఖపై ట్రోలింగ్ చేస్తున్నారని జిల్లా కాంగ్రెస్ మహిళా కార్యదర్శి సుమలత ఆరోపించారు.



గజ్వేల్‌రూరల్: మాట్లాడుతున్న మైనంపల్లి

సలహాలు పాటిస్తే పంటలకు రక్షణ

సిద్దిపేటఅర్బన్: వాతావరణ మార్పుల నేపథ్యంలో రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు పాటించి పంటలను రక్షించుకోవాలని అర్బన్ మండల వ్యవసాయాధికారి శ్రీనాథ్ సూచించారు. మండలంలోని పొన్నాలలో మంగళవారం వరి, పత్తి, కంది, ఆయిల్ పామ్ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరిలో సోకే మొగిపురుగు నివారణకు నారుమడిలో నారు పీకే ఏడురోజుల ముందు రెండు గుంటల నారుమడికి 800 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు చల్లుకోవాలన్నారు. దుబ్బుచేసే దశలో ఎకరానికి 10 కిలోల చొప్పున అవే గుళికలను, లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50ఎస్‌పీ 2గ్రా చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. చిరుపొట్ట దశలో తప్పనిసరిగా ఎకరానికి కార్టాస్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు 8కిలోలు పిచికారీ చేయాలని చెప్పారు.



పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి శ్రీనాథ్

సంక్షిప్త వార్తలు

◆ **ఉపాధిహామీ పనులపై గ్రామసభ**

హుస్నాబాద్‌రూరల్: మండల పరిధిలోని వంగరామయ్యపల్లిలో బుధవారం ఉపాధి హామీ పనులపై గ్రామసభ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి మంగళవారం తెలిపారు. గ్రామంలో పులు చేయించుకోనే రైతులు అందరు గ్రామ సభకు వచ్చి ఉపాధిహామి పథకంలో గ్రామంలో చేపట్టే పనుల వివరాలను తీర్మానించాలని కోరారు. రైతులకు సబంధించిన పనులు, వ్యవసాయ పొలాలకు వెళ్లెందుకు రోడ్ల నిర్మాణం పనులు కూడ చేపట్టనున్నట్లు తెలిపారు.

◆ **దరఖాస్తుల ఆహ్వానం**

కొండపాక(గజ్వేల్): స్థానిక మోడల్ స్కూల్లో గంటల ప్రాదిపదికన ఆంగ్లమాధ్యమంలో బోధకుడి ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ యజ్ఞశ్రీ మంగళవారం తెలిపారు. ఎంఏ బీఈడీ అర్హత ఉన్నవారికి, ఆదర్శ పాఠశాలలో పనిచేసిన అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. 16న ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు.

◆ **విద్యతోనే ఉజ్వలమైన భవిష్యత్**

జగదేవ్‌పూర్(గజ్వేల్): చదువుతోనే విద్యార్థులకు ఉజ్వలమైన భవిష్యత్ ఉంటుందని ఎస్ఐ చంద్రమోహన్ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు సైబర్ నేరాల నియంత్రణ, డ్రగ్స్, మత్తు పదార్థాలు వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కావద్దని సూచించారు. ప్రిన్సిపాల్ బానోతు రాజన్న, అధ్యాపకులు, పోలీసులు పాల్గొన్నారు.

◆ **నూతన భవనాన్ని నిర్మించరూ..!**

దుబ్బాక: పట్టణంలో నూతనంగా ఫైర్‌స్టేషన్ భవన నిర్మాణంతోపాటు కొత్త ఫైరింజన్‌ను మంజూరు చేయాలని దుబ్బాక డెవలప్‌మెంట్ ఫోరం అధ్యక్షుడు మాడబోయిన శ్రీకాంత్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ భవనంలేకపోవడంతో ఎన్నోయేళ్లుగా మార్కెట్ కమిటీ భవనంలోనే ఫైర్‌స్టేషన్ కొనసాగుతోందన్నారు. ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి, ఎంపీ రఘునందన్‌రావు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి స్పందించి న్యాయం చేయాలని కోరారు.

◆ **సన్మాన సభకు రండి**

అక్కన్నపేట(హుస్నాబాద్): రాష్ట్ర రెడ్డి జేఏసీ ఆధ్వర్యంలో 6వ తేదీన జరగనున్న రెడ్డి ప్రజాప్రతినిధుల సన్మాన మహోత్సవ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి రెడ్డి కులస్తులు కదలి రావాలని జేఏసీ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్‌రెడ్డి పిలుపునిచ్చారు. కట్కూర్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ రూ.5వేల కోట్లతో రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు శశికళరెడ్డి, పద్మ, ముకుందరెడ్డి, దశరతంరెడ్డి, శోభమంజుల, రాంరెడ్డి పాల్గొన్నారు.

◆ **పెరుగుతున్న నిరుద్యోగం**

దుబ్బాకటౌన్: పట్టణంలో సీపీఎం నాలుగో మహాసభను కారంపూరి లక్ష్మీనారాయణ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. పట్టణ కార్యదర్శి కొంపల్లి భాస్కర్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జి.భాస్కర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల వల్ల నిరుద్యోగం ఎన్నడూ లేని విధంగా పెరిగిందన్నారు. కార్యక్రమంలో రాజు, సాజిద్, శ్రీనివాస్, వెంకట్ స్వామి, రాజేందర్, ప్రశాంత్, రాములు, కనకయ్య, మల్లికార్జున్, లక్ష్మి, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

◆ **బీఎస్ఎన్ఎల్‌లో ఆవిర్భావ సంబురాలు**



సిద్దిపేటజోన్: సంస్థ ఆవిర్భవించి 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఉద్యోగులు సంబురాలు నిర్వహించారు. కేక్ కట్ చేశారు. మార్కెట్లలో ఉన్న పోటీని తట్టుకొని సంస్థ అనేక సేవలను అందుబాటులోకి తెచ్చిందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ డివిజన్ ఇంజనీర్ రవీందర్, అధికారులు మోహన్‌రెడ్డి, రాజ్‌కుమార్, శ్రీకాంత్, ముత్తయ్య, సాయి తదితరులు పాల్గొన్నారు.

◆ **చదువుతోనే ఉన్నత శిఖరాలు**

చిన్నకోదూరు(సిద్దిపేట): చదువుతోనే ఉన్నత స్థాయికి చేరవచ్చని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇష్టంపడి చదివితే అద్భుతాలు సృష్టిస్తారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

◆ **డీసీఎస్‌కు ఏఈఓల నిరసన**

బెజ్జంకి(సిద్దిపేట): డిజిటల్ క్రాఫ్ సర్వే కోసం కేంద్ర ప్రభుత్వాం ఒత్తిడి చేయడాన్ని నిరసిస్తూ వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏఈఓలు మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించారు. ఒకొక్క క్లస్టర్‌లోని పంటలను ఒక్క ఏఈఓ డిజిటల్ సర్వే చేయడం చాలా కష్టతరమని గ్రామస్థాయిలో తమకు సహాయకులను నియమించాలని డిమండ్ చేశారు. శ్వేత, రేణుక, మౌనిక, రచన, విజయ్, భరత్‌కుమార్ పాల్గొన్నారు.

◆ **ఆరోగ్యవంత సమాజమే మోదీ ధ్యేయం**

గజ్వేల్‌రూరల్: ఆరోగ్యవంత సమాజ నిర్మాణమే ప్రధాని మోదీ ధ్యేయమని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. మోదీ జన్మదినం సందర్భంగా ప్రతియేటా నిర్వహించే 'సేవా పఖ్వాడా' కార్యక్రమంలో భాగంగా మంగళవారం సరస్వతి శిశుమందిర్‌లో వైద్య శిబిరం నిర్వహించారు. పార్టీ నాయకులు గురువారెడ్డి, రాంరెడ్డి, మనోహర్‌యాదవ్, వెంకట్‌గౌడ్ మాట్లాడారు. వైద్యులు పద్మజ్యోతి, సాయినాథ్‌రెడ్డి, నరేష్‌బాబు, గీత వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. రాములు, శివకుమార్, మహేందర్, సందీప్ పాల్గొన్నారు.

◆ **నిందితుడు అరెస్టు: సీఐ**

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని చౌటపల్లిలో తెలంగాణ తల్లి విగ్రహానికి నిప్పంటించిన ఘటనలో పోలీసులు మంగళవారం నిందితుడిని అరెస్టు చేశారు. సీఐ శ్రీనివాస్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కామాద్రి రాంబాబు మద్యం మత్తులో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద సిగరెట్‌ను కొంత తాగి మిగిలిన దానిని అక్కడే వదిలేసి వెళ్లాడు. దీంతో ముసుగేసి ఉన్న విగ్రహానికి నిప్పంటుకుంది. ఈ విషయం విచారణలో తేలిందని, శాంతి భద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఐ విజయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

◆ **వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు**

అక్కన్నపేట(హుస్నాబాద్): ఓ వ్యక్తి ఫొటోను వాట్సాప్‌లో పెట్టి వేధింపులకు గురిచేస్తున్న ఒకరిపై కేసు నమోదైంది. ఎస్ఐ విజయ్‌భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చాపగానితండాకు చెందిన ఆటోడ్రైవర్ రాంచందర్, గణేశ్‌కు కొన్నినెలల కిందట గొడవ జరిగింది. పాత పంచాయితీలను మనుస్సులో పెట్టుకొని తన ఫొటోను వాట్సాప్‌లో పెట్టి వేధింపులకు గురిచేస్తున్నాడంటూ రాంచందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గణేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

◆ **దొంగ దొరికాడు..**

అక్కన్నపేట(హుస్నాబాద్): మండల కేంద్రంలోని ఓ ఇంట్లో చోరీ జరిగిన ఘటనలో దొంగ దొరికాడు. పోలీసులు నిందితుడిని మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ విజయ్‌భాస్కర్ కథనం ప్రకారం సిద్దిపేట రూరల్ మండలానికి చెందిన గడ్డం అనిల్ సోమవారం రాత్రి తంగళపల్లి పర్శయ్య ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డాడు. అతని మానసిక పరిస్థితి సరిగా లేక ఆయా గ్రామాలు తిరుగుతూ ఉంటాడు. ఈ క్రమంలో మంగళవారం అనుమానస్పదగా తిరుగుతున్న అతడిని పట్టుకొని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నాడన్నారు.